క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ వివరాల ప్రకారం... గురువారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 23 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఐదు మందికి రూ.2 వేల జరిమానా, మరో 13 మందికి రూ.వెయ్యి, నలుగురికి రూ.500, మరో వ్యక్తికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

కంది తహసీల్దార్‌గా రవికుమార్



కంది(సంగారెడ్డి): కంది మండల తహసీల్దార్‌గా వి.రవికుమార్ నియమితులయ్యారు. యాదాద్రి జిల్లా ఆత్మకూరు మండల తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన కందికి బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ ఆశాజ్యోతి సంగారెడ్డి ఆర్డీఓ కార్యాలయం డీఏవోగా బదిలీ అయ్యారు. గతనెల 7న బాధ్యతలు చేపట్టి ఆమె 45 రోజుల్లోనే బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది.

25న ఎల్లమ్మ ఆలయంలో మహాయజ్ఞం



రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

జిన్నారం (పటాన్‌చెరు): జంగంపేట గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో ఈనెల 25న లోక కల్యాణార్థం అఖండ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, మహాయజ్ఞం నిర్వహించ తలపెట్టినట్లు ఆలయకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, అర్చకుడు శ్రీనివాస భార్గవ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం 9 గంటలకు ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల భక్తులే కాకుండా హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి 150 మంది మహిళా భక్తులు 11 సార్లు పారాయణంలో పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ, అర్చన తదితర పూజలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

వాసవీనగర్‌లో పోలీసుల తనిఖీ

రైల్వేస్టేషన్‌లో దొంగిలించబడిన ల్యాప్‌టాప్ స్వాధీనం

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని వాసవీనగర్ కాలనీలో ఎస్ఐ పాండు నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ల్యాప్‌టాప్ దొంగతనం కేసు నమోదైంది. ఆ కేసు వివరాలను జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లకు పంపించారు. ఈ క్రమంలో ల్యాప్‌టాప్ లొకేషన్ మాత్రం జోగిపేటలో చూపించడంతో కంప్యూటర్ రిపేరింగ్ సెంటర్, అమెజాన్ కార్యాలయంతో పాటు అదే భవనంలోని పైఅంతస్తులో అద్దెకు ఉంటున్న వారి వద్దకు వెళ్లి ఎస్ఐ తనిఖీ చేయగా ల్యాప్‌టాప్ దొరికింది. ఆ గదిలో ఇద్దరు పోస్టల్ డిపార్టుమెంట్‌కు చెందిన ఉద్యోగ యువకులు ఉండగా వారితో పాటు 15 రోజుల క్రితం పిట్లం ప్రాంతానికి చెందిన విద్యార్థి చేరాడు. అక్సాన్‌పల్లిలో పనిచేసే ఉద్యోగికి స్నేహితుడు కావడంతో గదిలో ఉంచుకున్నారు. వారి వద్ద ఉన్న ల్యాప్‌టాప్ రైల్వే స్టేషన్‌లో దొంగిలించబడినదని ఎస్ఐ తెలియజేశాడు. విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అసలు ల్యాప్‌టాప్ ఎలా వచ్చిందన్న విషయాన్ని విచారిస్తున్నామని తెలిపారు. పోలీసులు యువకులను అదుపులోకి తీసుకోవడంతో కాలనీలో చర్చనీయాంశమైంది.

సెలక్షన్ కమిటీలు వేయొద్దు

జహీరాబాద్ టౌన్: సభలు నిర్వహించకుండా ఇందిరమ్మ ఇళ్ల సెలక్షన్ కమిటీలను వేయవద్దని సీపీఐ జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి కె.నర్సిహులు ఒక ప్రకటనలో కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గ్రామ సభలు నిర్వహించకుండా దరఖాస్తులు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. లబ్ధిదారుల ఎంపిక చేపట్టిన తరువాత అధికారులు విచారణం కోసం ఇంటింటి సర్వే నిర్వహించాలని కోరారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నయ్యపల్లి ఈరన్న చెరువు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తూ కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం పక్కన కొంత మంది రియల్టర్లు భూములు కొనుగోలు చేశారు. ఆ భూములకు రోడ్లు వేసేందుకు ఈరన్న చెరువు నుంచి మట్టిని తరలిస్తున్నారు. కొంతమంది వారికి సహకరించడంతోఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ ఏఈ మణిభూషణ్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గ్రామాల్లో జోరుగా పేకాట

పోలీసులు దాడి చేసినా ఆగని వైనం

- శివారు ప్రాంతాలే అడ్డాగా పేకాట స్థావరాలు
- గట్టి నిఘా పెట్టాలంటున్న ప్రజలు
- సమాచారమిస్తే గోప్యంగా ఉంచుతాం : పోలీసులు



జహీరాబాద్ ఐడీఎస్ఎంటీ కాలనీలో పేకాట శిబిరంపై దాడి చేసిన ఎస్ఐ.కాశీనాథ్(ఫైల్)

జహీరాబాద్ టౌన్: జీవితాలను ఛిద్రం చేస్తూ బతుకులను అంధకారంలో పడేసే పేకాటను జహీరాబాద్ నియోజకవర్గంలో జోరుగా ఆడుతున్నారు. కూర్చున్న చోటే సులభంగా డబ్బులు సంపాదించాలన్న అత్యాశతో జేబులు గుల్ల చేసుకొని తమ జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. పోలీసులు దాడులు చేసినా యథేచ్ఛగా ఆడుతున్నారు. పోలీసులు కూడా ఎవరైనా సమాచారం ఇస్తే తప్పా దాడులు చేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జహీరాబాద్ పట్టణంతో పాటు జనావాసాలకు దూరంగా జూదం నిర్వహిస్తున్నారు. గ్రామ శివారు ప్రాంతాలను అడ్డాగా మార్చుకుని కొంత మంది పేకాటాడుతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా పంట పొలాలు, చెట్ల పొదలు, తోటలు వేదికగా మార్చుకుంటున్నారు. ఆడే వారికి తప్పా ఇతరులకు ఏ మాత్రం సమాచారం లేకుండా ఔత్సాహిక సభ్యులు బృందాలుగా ఏర్పడి నిర్ణయించుకున్న స్థలానికి చేరుకుంటారు. మద్యం, మాంసం అక్కడికే తెప్పించుకుని పొలాలనే అడ్డాగా మార్చుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే పేకాట ఆడి రాత్రివేళ ఇంటికి తిరిగి వస్తారు.

కొన్ని ఘటనలు..

- జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో ఈ నెల 17న టౌన్ ఎస్ఐ.కాశీనాథ్ దాడులు నిర్వహించి పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.7,920 నగదు, మూడు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.
- న్యాల్‌కల్ మండలంలోని చాల్కి గ్రామ శివారులోని ఖాళీ ప్రదేశంలో ఈ నెల 19న పేకాటాడుతున్న ముగ్గురిని హద్నూర్ ఎస్ఐ రాజశేఖర్ పట్టుకున్నారు. రూ.44 వేల నగదు, మూడు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఖాళీ సమయం కావడంతో...

జహీరాబాద్ వ్యవసాయాధారిత ప్రాంతం. వేసవిలో ఖాళీగా ఉంటుంది. ఖరీఫ్ సీజన్ వచ్చే వరకు అంతగా పనికూడా ఉండదు. యాసంగి పంటలు అమ్ముడుపోయే సరికి చేతిలో కూడా డబ్బు ఉంటుంది. సామాన్య ప్రజలే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు కూడా కొంత మంది పేకాట ఆడుతుంటారు. ముందస్తు సమాచారం మేరకు అప్పుడప్పుడు పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారు. పేకాటరాయుళ్లతో పాటు నగదు, పేకాట ముక్కలు, మోటారు బైక్‌లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంటున్నారు. కానీ పూర్తి స్థాయిలో పేకాట జూదాన్ని నిలువరించలేకపోతున్నారు. గట్టి నిఘా పెట్టి పేకాట స్థావరాలపై తరచూ దాడులు నిర్వహించాలని ప్రజలు పోలీసులను కోరుతున్నారు.

> **కేసులు నమోదు చేస్తున్నాం**
>
> జహీరాబాద్ ప్రాంతంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం వస్తే కచ్చితంగా దాడులు చేసి వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. పట్టుబడితే ఎంతటివారైనా వదిలే ప్రసక్తి లేదు. జూదం ఆడుతున్నట్లు సమాచారం ఇస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం
>
> – శివలింగం, సీఐ, జహీరాబాద్ టౌన్

సీఎంకు స్వాగతం పలికిన ప్రముఖులు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న నీలం మధు ముదిరాజ్



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య

సమస్యలపై నాయకుల వినతి

పటాన్‌చెరు/ రాయికోడ్(అందోల్): జహీరాబాద్ నియోజకవర్గంలో శుక్రవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని నీలం స్పష్టం చేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో హెలిప్యాడ్ వద్ద సీఎంను సన్మానించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులున్నారు.

మండపానికి స్థలం కేటాయించాలని వినతి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌లో లింగాయత్ సమాజ్ బాంధవులకు అనుభవ మండపం, శ్మశాన వాటిక కోసం ప్రభుత్వ భూమి కేటాయించాలని లింగాయత్ సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ షెట్కార్, ఆర్.సుభాష్ సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం హుగ్గెల్లి వద్ద ప్రతిష్ఠించిన బసవేశ్వరుడి విగ్రహావిష్కరణకు వచ్చిన సీఎంను సామూహిక ప్రార్థనలకు, శ్మశాన వాటికకు 5 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని కోరారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందజేత

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో నివసించే నక్క శ్రీనుబాబు (36) విద్యుత్ పనులు నిర్వహించేందుకు ఇటీవల చందానగర్‌కు వెళ్లాడు. నిర్మాణంలో ఉన్న భవనంలో విద్యుత్ వైరింగ్ పనులు నిర్వహిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనను మృతుడి కుటుంబీకులు స్థానిక మున్సిపల్ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డిని కలిసి విన్నవించారు. ఈ మేరకు భవన యజమానిని పిలిచి మృతుడి కుటుంబానికి నష్టపరిహారం అందించాలని కోరారు. దీంతో రూ.13 లక్షలు నష్టపరిహారాన్ని చెక్కురూపంలో మృతుడి భార్యా బిడ్డలకు అందజేశారు. ఆపదకాలంలో అండగా నిలిచిన నాయకులకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



బాధిత కుటుంబ సభ్యులకు నష్టపరిహారం అందజేస్తున్న ఇంటి యజమాని, స్థానిక నాయకులు

విద్యార్థి ఆసక్తికి అనుగుణంగా బోధన

డీఈఓ రాధాకిషన్

కొల్చారం(నర్సాపూర్)/కౌడిపల్లి: పాఠశాల గదిలో విద్యార్థి ఆసక్తికి అనుగుణంగా బోధన సాగాలని డీఈఓ రాధాకిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. తరగతి గదిలోకి వెళ్లే ముందే ఉపాధ్యాయుడు బోధనకు అవసరమైన ఉపకరణాలను సిద్ధం చేసుకొని, సరళమైన పద్ధతిలో విద్యాబోధన చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరేలా అవసరమైన అన్ని అవకాశాలను వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ సత్యనారాయణరావు తదితరులు ఉన్నారు. అనంతరం కౌడిపల్లి మండల కేంద్రంలో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను పరిశీలించారు.



కొల్చారం: ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ రాధాకిషన్

పహల్గాం మృతులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

హవేళీఘణాపూర్(మెదక్): పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి తపాస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించారు. డైట్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌనం పాటించి, వీర సైనికుల ధైర్యసాహసాలకు మద్దతుగా జాతీయ జెండాలను ప్రదర్శించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపధ్యాయులు భాస్కర్, యాదగిరి, లక్ష్మణ్, కులకర్ణి, కృష్ణమూర్తి, మీర, రామేశ్వర్, శ్రీనివాస్ ప్రవీణ్, సుకన్య, సునీత, కవిత, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రామేశ్వరం బండ గ్రామానికి చెందిన పేద యువతి వివాహానికి తమ వంతు సహాయంగా మాజీ సర్పంచ్ అంతిరెడ్డి పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం వీకర్ సెక్షన్ కాలనీలో యువతి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నగేష్, సాయిలు, రాములు, లోకేశ్, సూరిబాబు, దానయ్య పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేందుకే శిక్షణ




సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగరం శ్రీనివాస్

కల్హేర్(నారాయణఖేడ్): విద్యా ప్రమాణాలు పెంచేందుకే శిక్షణ ఇస్తున్నామని ఎంఈఓలు జి.శ్రీనివాసులు, శ్రీనివాస్ అన్నారు. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో శుక్రవారం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. విద్యా వ్యవస్థలో మార్పుల ప్రకారం పేద విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించాలని సూచించారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

నారాయణఖేడ్: లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఖేడ్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బావుగి సాయి సంగమేశ్వర్‌ను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, పార్టీ ఓబీసీ, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, సుధాకర్ కోరారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయనను శుక్రవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక



పల్లె శ్రీజిత్

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బాచేపల్లికి చెందిన విద్యార్థి. పల్లె శ్రీజిత్ సైనిక్ స్కూల్‌లో 6వ తరగతికి ఎంపికయ్యాడని లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

పంచలోహ విగ్రహాలు అందజేత

శివ్వంపేట(నర్సాపూర్) : మండల పరిధి గూడూర్‌లో నిర్మిస్తున్న శ్రీ గురుపీఠానికి దాతలు శుక్రవారం పంచలోహ విగ్రహాలను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన వారు దత్తాత్రేయ, సాయిబాబా పంచలోహ విగ్రహాలను శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



అమర జవాన్లకు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు , తపస్ సంఘం నాయకులు

అమర జవాన్లకు నివాళులు

నారాయణఖేడ్: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ సంబురాలను శుక్రవారం నారాయణఖేడ్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఖేడ్ జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు. వారితో కలిసి తపస్ నాయకులు సంబురాలు నిర్వహిస్తూ దేశ సైనికుల శక్తి సామర్థ్యాలు, సాహసాలను కీర్తించారు. ఈ సందర్భంగా వీరోచిత పోరాటంలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. సంఘం బాధ్యులతోపాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'ఏ హోలిస్టిక్ వ్యూ ఆఫ్ సైన్స్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎంలు

రాయికోడ్(అందోల్): మండలంలోని అల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు శుభనయన్ నూతనంగా రచించిన 'ఏ హోలిస్టిక్ వ్యూ ఆఫ్ సైన్స్' పుస్తకాన్ని మండల విద్యాధికారి మాణయ్య, హెచ్‌ఎంలు శ్రీనివాస్, ఖైరత్ అలీలతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. రాయికోడ్‌లోని ఉన్నత పాఠశాలలో ఎంఈఓను కలిసిన శుభనయన్ తాను రచించిన పుస్తకంలోని అంశాలను క్లుప్తంగా వివరించారు. ఆంగ్లభాషలో రచించిన పుస్తకంలోని వివిధ అంశాల వారీగా తెలుగులో సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ, హెచ్‌ఎంలు ఉపాధ్యాయుడిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీనివాస్, ఖైరత్ అలీ, సీఆర్‌పీ రాజు ఉన్నారు.

విత్తనాల మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్



మాట్లాడుతున్న ఏడీఏ నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): పత్తి విత్తనాలు కొనుగోలు చేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రైతులు విత్తనాలు లూజ్‌గా కాకుండా ప్యాకెట్లు మాత్రమే కొనుగోలు చేయాలని, తయారైన తేదీ, ముగిసిన కాలం పరిశీలించాలన్నారు. జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజల్ కమిటీ (జీఈఏసీ) నంబర్ ఉన్న విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. పక్క రాష్ట్రాల నుంచి సరఫరా అయిన విత్తనాలు అమ్ముతున్న వివరాలు వ్యవసాయాధికారులకు తెలుపాలన్నారు. బోల్గార్డ్ -2 పత్తి విత్తనాలు 475 గ్రాముల ప్యాకెట్ ధర రూ. 901 ఉందని, అధీకృత డీలర్ వద్ద కొనుగోలు చేసి కంపెనీ పేరు, లాట్ నంబర్, విత్తన రకం, బ్యాచ్ నంబర్, ఖరీదు వివరాలు ఉండేట్లు బిల్లు తీసుకోవాలని తెలిపారు. బీటీ -3 విత్తనాలు వాడవద్దని రైతులకు సూచించారు.

ఆర్టీసీ బస్టాండ్లలో దుకాణాలకు టెండర్లు

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపో పరిధిలో ఖేడ్, పెద్దశంకరంపేట్, కంగ్టి బస్టాండ్‌లలో దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు వ్యాపారులు టెండర్ల ద్వారా అనుమతులు పొందాలని డీఎం మల్లేశయ్య తెలిపారు. ఖేడ్ బస్టాండ్‌లో 9 దుకాణాలు ఉన్నాయని, పెద్దశంకరంపేటలో 5, కంగ్టిలో రెండు దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు స్థలాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి 29వరకు టెండర్ ఫారాలు విక్రయించనున్నట్లు తలిపారు. టెండర్లు వేసేందుకు చివరితేదీ ఈనెల 30 అని, అదేరోజు తెరవనున్నట్లు చెప్పారు. వివరాలకు డిపోలో సంప్రదించాలని, లేదా 9959 223170, 9441 238542 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సింధు రెడ్డి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ భోర్ఖడేకు కార్పొరేటర్ సింధు రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జోనల్ కమిషనర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగినట్లు తెలిపారు. డివిజన్‌లో గ్రీన్ వ్యర్థాలను లిఫ్టింగ్ చేయడం లేదన్నారు. మ్యాక్స్ సొసైటీ కాలనీ వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా చెత్త వేస్తున్నారని, దీంతో దుర్వాసన వస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బెల్ యాజమాన్యంతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు. సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరామని తెలిపారు. ఇందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. అలాగే రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ పుష్ప జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.



మీర్ఖాన్‌పేట్‌లో కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మీర్ఖాన్‌పేట్‌లో దుర్గమ్మ జాతర ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం కుస్తీ పోటీలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. చివరి కుస్తీ పోటీల్లో విజేతకు రూ. 11 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నీరుడి వేణు, నాందేవ్, సాయిలు, రాజేశ్వర్‌గౌడ్, అబ్రహం , యకోబ్ పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

నాసిరకంగా నీటితొట్లు.. జీవాల పాట్లు



వెల్దుర్తి(తూప్రాన్) : మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు మండలంలోని శెట్టిపల్లిలో నిర్మించిన నీటి తొట్లు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. పనులను అధికారులు పర్యవేక్షించకపోవడంతో గుత్తేదారు నాసిరకంగా నిర్మించారు. కొన్ని నెలల వ్యవధిలోనే తొట్లకు పెద్ద పెద్ద పగుళ్లు ఏర్పడి అందులో నీరు నిల్వ ఉండటం లేదు. ఫలితంగా మూగజీవాలకు నీటి గోస తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ధనం దుర్వినియోగమయ్యేలా నాసిరకం నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.